

రాంనగర్‌లో గణపతుల నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న భక్తులు


నిమజ్జనానికి రాంనగర్ నుంచి తరలివెళ్లిన త్రిశూల్ యూత్ అసోసియేషన్ వారాహి మాతా గణనాథుడు


ముషీరాబాద్ స్వామివివేకానంద యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలంపాటలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి అబ్దుల్ ఖయ్యూం దక్కించుకున్నారు. వచ్చే సంవత్సరం భారీ వినాయకుడిని కొనిస్తానని అసోసియేషన్ నాయకులకు హామీ ఇచ్చారు. లడ్డూను కొని మత సామరస్యాన్ని చాటుకున్నారు. - (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)


నిమజ్జనానికి రాంనగర్ నుంచి తరలివెళ్లిన రాంనగర్ టీఆర్‌టీ కాలనీ అసోసియేషన్ భారీ గణనాథుడు


నిమజ్జనానికి రాంనగర్ నుంచి తరలివెళ్లిన చైతన్య యూత్ అసోసియేషన్ భారీ గణనాథుడు

నిమజ్జన హోరు..అదే జోరు..

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- రాంనగర్‌లో ఆదివారం తెల్లవారుజాము వరకు గణేష్ ఊరేగింపులు
- ఆకట్టుకున్న వివిధ దేవతామూర్తుల ప్రతిమలు
- పూణె బృందం విన్యాసం, ఆర్కెస్ట్రా, భజన కార్యక్రమం

ముషీరాబాద్ నియోజకవర్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం హోరు రెండో రోజూ కొనసాగింది. రాంనగర్‌లో ఆదివారం తెల్లవారుజాము వరకు గణేష్ ఊరేగింపులు కొనసాగాయి. ఈ వేడుకలను తిలకించడానికి వేలాదిగా భక్తజనం తరలొచ్చారు.

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో గణేష్ ఆగమన వేడుకలతో పేరొందిన రాంనగర్ గణపతి నిమజ్జన వేడుకలను కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించి, భక్తజనంతో భళా అనిపించుకున్నారు నిర్వాహకులు. రాంనగర్‌లోని టీఆర్‌టీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమర్‌నాథ్ మంచులింగం, 12 జ్యోతిర్లింగాలు ఈసారి విశేషంగా నగరవాసులను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు అదే తరహాలో ఆదివారంరాత్రి నిమజ్జన వేడుకలను చిన్న, ఆకాష్ టీమ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 53 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గణపతి వేడుకల్లో భాగంగా నిమజ్జనం నిర్వాహకులు విన్ను ముదిరాజ్, నాగేష్ ముదిరాజ్ టీమ్ సభ్యులు ఆదివారం రాత్రి కనులపండువగా ఊరేగింపును నిర్వహించారు. 27 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంనగర్ కా రాజా పేరుతో ఏర్పాటు చేసిన వారాహి మాత విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి పూణె బ్యాండ్, ప్రత్యేక కళాకారులు, ఆర్కెస్ట్రాతో ఊరేగింపు నిర్వహించారు. వీరు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లు ఆకట్టుకున్నాయి. గణేష్‌నగర్‌లో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సనాతన ధర్మం ఉట్టిపడేలా గణపతి ఏర్పాటుచేశారు. నిమజ్జన ఊరేగింపులో విష్ణుమూర్తి, హనుమంతుడు, శివుడు దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీగణపతి యూత్ అసోసియేషన్ నిర్వాహకులు సిద్ధిఖీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాకాలుడి విగ్రహం ఏర్పాటు చేసి భక్తులను ఆకర్షించారు.


రాంనగర్‌లో గణపతి నిమజ్జన ఊరేగింపులో ఆకట్టుకున్న హనుమంతుడి ప్రతిమ


రాంనగర్‌లో ఆకట్టుకున్న శివుడి ప్రతిమ


కాచిగూడ డివిజన్‌లో గణనాథునికి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ ఉమాదేవి, రమేష్ యాదవ్ తదితరులు


చిక్కడపల్లి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఊరేగింపులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


టీఆర్‌టీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊరేగింపులో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం


గణపతి నిమజ్జన ఊరేగింపులో డప్పు వాయిస్తున్న పూణె బృందం


రాంనగర్‌లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూను రూ.5.70 లక్షలకు దక్కించుకున్న సాయికుమార్


రాంనగర్ రాజ్ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న కేబుల్‌లను కట్ చేస్తున్న విద్యుత్ శాఖ ఏఈ సుధామా, విద్యుత్ శాఖ సిబ్బంది


రథోత్సవంలో ఆలయ ఈవో, చైర్మన్, ధర్మకర్తలు, భక్తులు


శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీధర్‌చారి ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను వేలంపాటలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దీపిక రూ.18వేలకు దక్కించుకున్నారు. ఆమెను అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

లక్ష్మీగణపతి ఆలయంలో విశేషపూజలు


చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో జరుగుతున్న స్వామివారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం విశేషపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం మహాపూర్ణాహుతి, అఖండబలి, సత్యనారాయణస్వామి వ్రతం, రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవం ఆర్టీసీక్రాస్‌రోడ్డు, జవహర్‌నగర్, అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు గజానంద్, దినేష్, నవీన్, బానుచందర్, భక్తులు పాల్గొన్నారు.

మహాత్మా ఆధ్వర్యంలో 52వ సారి..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో మహాత్మా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 52వసారి వినాయకమండపం ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపక సభ్యులు ఎమ్మెస్ శ్రీనివాసరావు, డా.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆనాటి నుంచి వరుసగా మండపం ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన వినాయకుడు ఘనంగా నిమజ్జనానికి తరలాడు.

గణేశ్ ఉత్సవాలు విజయవంతం

చిక్కడపల్లి: గణేశ్ ఉత్సవాలు విజయవంతం కావడం హర్షణీయమని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎ.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి నగరంలోని లక్షల సంఖ్యలో జనాలు, భారీగణేశులు వినాయక సాగర్(ట్యాంక్‌బండ్)కు చేరుకున్న తరుణంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి స్వాగతం పలికిందన్నారు. వినయ్‌కుమార్, మద్దూరి శివాజీ, పూస రాజు, ఆనంద్‌రావు, ఉమేష్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జన ఊరేగింపులో బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండీ ఖదీర్, నరేష్, శ్రీను నాయుడు


దాయారం మార్కెట్ నుంచి బయల్దేరిన ఊరేగింపులో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డి


శాస్త్రీనగర్‌లో గణనాథుని నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్రనేత హరిబాబుయాదవ్ తదితరులు

'త్రిశూల్' గణపతి లడ్డూ రూ.5.7లక్షలు

రాంనగర్: రాంనగర్‌లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాంనగర్ కా రాజా వారాహి మాత గణపతి లడ్డూను వేలంపాటలో గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న సాయి ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ అధినేత కాదీవుల సాయికుమార్ కైవసం చేసుకున్నాడు. శనివారం రాత్రి జరిగిన వేలంపాటలో పలువురు పోటీపడ్డారు. అయితే 2022లో రూ.4.16 లక్షలకు కొనుగోలు చేసిన సాయికుమార్ ఈసారి రూ.5.70 లక్షలకు దక్కించుకున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు సాయిసంతోష్, రాజు, రఘు, సాయిమహేష్, శివానంద్ సాయికుమార్‌ను సత్కరించి లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు సాయి సంతోష్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు, ఈసారి 27 కిలోల లడ్డూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లడ్డూనుతగ్గించుకున్న సాయికుమార్ మాట్లాడుతూ 2022లో లడ్డూను దక్కించుకున్న తర్వాత ఆర్థికంగా కలసొచ్చిందన్నారు. అందుకే ఈ సంవత్సరం గణపతి లడ్డూను దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

ఊరేగింపునకు అడ్డంకులు లేకుండా చర్యలు

ముషీరాబాద్: గణేష్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా విగ్రహాల తరలింపులో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను, కేబుల్ తీగలను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఆజామాబాద్ విద్యుత్ శాఖ డీఈ కమల్‌కుమార్, ఏడీఈ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఏఈలు సుధామా, సునీల్‌రెడ్డి విద్యుత్ శాఖ సిబ్బందితో భారీ విగ్రహాల తరలింపు వద్దే ఉండి రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించారు. విగ్రహాలు తరలిన వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాత్రి సమయంలో భారీవినాయకులు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలను పరిశీలిస్తూ వెంటనే చర్యలు తీసుకున్నామని తెలిపారు.


చిక్కడపల్లి కాపువాడలో వినాయక లడ్డూను రూ.3.40 లక్షలకు సాయికుమార్, పవన్, కౌశిక్ దక్కించుకున్నారు


వివేకానంద యూత్ అసోసియేషన్ గణనాథుని లడ్డూను రూ.1.30 లక్షలకు దక్కించుకున్న వారాసిగూడకు చెందిన వ్యాపారి మల్కిత్‌సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు

రాంనగర్: నగర పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్ కృషితో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు జరిగాయని పీపుల్ అండ్ పీఎస్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ముక్తార్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం హరినగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరగడంలో నగర పోలీసులు ఎంతో కృషి చేశారని, వారందరికీ తమ సంస్థ పక్షాన అభినందనలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముక్తార్ హుస్సేన్ తదితరులు


శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూను వేలంపాటలో రూ.69 వేలకు దక్కించుకున్న స్థానికుడు శ్రీనివాస్‌కు అందజేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ


రాంనగర్‌లో గణపతి నిమజ్జన ఊరేగింపులో ఆకట్టుకున్న విష్ణుమూర్తి ప్రతిమ

నేడు చలో కలెక్టరేట్ : ఎంఆర్‌పీఎస్

ముషీరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు సోమవారం నిర్వహించే చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కోరారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దశరత్, ఎల్లయ్య, నర్సింగ్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

రైలులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పార్శీగుట్టకు చెందిన మాధవి నాగర్‌సోల్‌లో కాచిగూడకు రావడానికి అజంత ఎక్స్‌ప్రెస్ రైలెక్కింది. ధర్మాబాద్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో 35గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు, రెండుసెల్‌ఫోన్లు ఉన్నాయి. ఆదివారం మాధవి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



టీపీసీసీకి సత్కారం

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా బొమ్మన మహేష్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టి, సంవత్సరం పూర్తయిన సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షరాలు ఉషశ్రీ ఆదివారం కలిసి సత్కరించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ


అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ బలమైన ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్రస్థాయి సమావేశం అధ్యక్షుడు ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 8 గంటల పని దినాన్ని పాటించాలని, పని స్థలాల్లో రక్షణ కల్పించాలని అక్టోబరు 6న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరెట్ల ముందు ధర్నా చేపట్టాలన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై భూభాగంపై సాగిస్తున్న దాడులను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్, నాయకులు జి.భారతి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల కర్నాటక యూనియన్ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు వెంకన్న, దాసు, శివబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, అనురాధ, భూమయ్య, నరేష్, సారంగపాణి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆవాజ్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబ్బాస్ సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య, సాంస్కృతిక కార్యకర్తల సమావేశం టీపీఎస్‌కే, తెలంగాణ సాహితీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భవిష్యత్ ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందని, ఈ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. 1945 నుంచి 1951 వరకు సాగిన పోరాటాలలో సేకరించిన ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 15 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట పాటను పల్లెపల్లెకు తెలియజేయాలన్నారు. సాహితీ సంస్థ కార్యదర్శి కె.ఆనందచారి, టీపీఎస్‌కే కార్యదర్శి కె.హిమబిందు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 31 వరకు జరిగే బతుకమ్మ పండగలో భాగంగా కవయిత్రుల వర్క్‌షాప్, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.నర్సింహ, శాంతారావు, భూపతి వెంకటేశ్వర్లు, రాములు, మోహన్ కృష్ణ, సలీమా, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ.అబ్బాస్ తదితరులు

భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం

బర్కత్‌పుర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం అని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని ఉత్తరాది మఠంలో జరుగుతున్న చతుర్మాస దీక్షల సందర్భంగా ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ శ్రీపాదుల స్వామీజీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ... ప్రపంచ దేశాలన్నీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైపు చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, యువమోర్చా రాష్ట్రకార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను గౌరవించుకోవాలని సిటీ సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ వీవీపీ అంజనికుమారి అన్నారు. శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని త్యాగరాయ గానసభలో సంగీతగురువు, గాయని వీవీ.లక్ష్మికి భారత్ ఐకాన్ అవార్డ్‌ను బహూకరించి సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంజనికుమారి మాట్లాడుతూ ఏ రంగంలోని వారైనా గురుస్థానం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి కోదాటి అరుణ, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, భరతనాట్యగురువు రాగరంజని, సాయి, రఘు, కోటిరెడ్డి, చక్రపాణి, దామోదరం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాకాళి దేవాలయంలో ఛండీహోమం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ఛండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు వై.చంద్రమౌళి, భక్తులు హోమం, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ పౌర్ణమిరోజు ఛండీ హోమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డులో మురుగు పరుగు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలికాలనీ ప్రధాన రోడ్డులో వారం రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతున్నాయి. పాదచారులు, వాహనదారులు మురుగునీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పద్మశాలికాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధానకార్యదర్శి ఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు.

గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాల మూసివేత

చిక్కడపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం తెల్లవారుఝామున ఆలయాన్ని సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. చిక్కడపల్లిలోని వివేక్‌నగర్ ఆంజనేయస్వామి, ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి, బాగ్‌లింగంపల్లి షిర్డీసాయిబాబా ఆలయాలను మూసివేశారు. తిరిగి ఉదయాన్నే భక్తులను అనుమతించనున్నారు.